క్లుప్తంగా

రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్‌కు సత్కారం



శేషగిరిరావుని దుశ్శాలువాతో సత్కరిస్తున్న పాలిమేర హరికృష్ణ

ఏలూరు (టూటౌన్): ఏలూరు జిల్లా కేంద్ర గ్రంథాలయానికి విచ్చేసిన రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావును రాష్ట్ర చర్మకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ నాయకులు పాలిమేర హరికృష్ణ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన్ను దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ చీర్ల పద్మశ్రీ, సీనియర్ జర్నలిస్టు యంత్రపాటి అశోక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాత్రికేయులు అశోక్ యుద్ధము - ప్రేమ అనే పుస్తకాన్ని పాలిమేర హరికృష్ణకు బహూకరించారు.

కాలభైరవి ఆలయం వద్ద అన్నసమారాధన

పెదవేగి : పెదవేగిలోని కాలభైరవీ అమ్మవారి ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని శనివారం అన్నసమారాధన నిర్వహించారు. పెదవేగితోపాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి అమ్మవారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయకమిటీ గౌరవాధ్యక్షుడు రాజులపాటి బాపనయ్య, చైర్మన్ తాతా శారద. కమిటీసభ్యులు పొన్నూరు శంకర్ గౌడ్, తాతా నాగేశ్వరరావు, బాలిన శ్రీనివాసరావు, సింహాద్రి ఖాసులు, మరీదు మహేష్. మట్టా సుబ్బారావు, పలివెల సత్యనారాయణ తదితరులు అన్నసమారాధన ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఉపాధి హామీ పథకానికి కేంద్ర ప్రభుత్వం తూట్లు

పెదవేగి : ఉపాధి హామీ యాత్ర శనివారం రెండో రోజు గోపన్నపాలెం, పెదవేగి, రాట్నాలకుంట, విజయరాయి, నడిపల్లి, రామచంద్రపురం, అయ్యపరాజు గూడెం, గ్రామాల్లో నిర్వహించారు. బృందం సభ్యులు ఉపాధి పని ప్రదేశాల్లో కూలీలతో కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా సంఘ నేతలు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకాన్ని నీరు గార్చేందుకు కేంద్రం 2023-24 యూనియన్ బడ్జెట్ కేటాయింపుల్లో భారీ కోత విధించిందని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఉపాధి పథకాన్ని పూర్తిగా ఎత్తివేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతి ఒక్కరూ ఖండించాలని కోరారు. ఈకార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పి. రామకృష్ణ సహాయ కార్యదర్శి తుమ్మల సత్యనారాయణ జిల్లా కమిటీ సభ్యులు రాజశేఖర్, దాసు, పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలపై సమరశీల పోరాటాలు చేయాలి

ఏలూరు (టూటౌన్) : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలపై సీపీఐ కార్యకర్తలు సమరశీల పోరాటాలు నిర్వహించాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ పిలుపు నిచ్చారు. సీపీఐ ఏలూరు జిల్లా కార్యవర్గ సమావేశం స్ఫూర్తి భవన్లో జిల్లా కార్యవర్గ సభ్యులు కారం దారయ్య అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వనజ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ నాయకత్వం ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం నిత్యావసర వస్తు ధరలను నియంత్రించడంలో ఘోరంగా విఫలమైందన్నారు. దేశంలో ప్రజల మధ్య మత విద్వేషాలు రగిలించి, లౌకిక వాదానికి తూట్లు పొడుస్తూ మతోన్మాదాన్ని సృష్టించి మూడోసారి కూడా అధికారం కైవసం చేసుకోవడానికి బీజేపీ ప్రయత్నిస్తోందని, అటువంటి ప్రయత్నాలను దేశ ప్రజలు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. తాను అధికారంలోకి వస్తే ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కలిస్తానని మోదీ వాగ్దానం చేసి అధికారం చేపట్టిన తరువాత నిరుద్యోగ యువతను మోసగిస్తూ ఉన్న ఉద్యోగాలు తీసేస్తున్నారని విమర్శించారు. మూడు వ్యవసాయ నల్ల చట్టాలను తీసుకు వచ్చి వ్యవసాయాన్ని కార్పొరేట్ మయం చేస్తున్నారని ఆరోపించారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, విభజన హామీల అమలు, విశాఖ రైల్వే జోన్, ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ వంటి హామీలను అమలు చేయకుండా రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిందన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య మాట్లాడుతూ ఏప్రిల్ 14 నుంచి 30 వరకూ జిల్లాలో సీపీఐ, సీపీఎం నిర్వహించిన ప్రచార భేరి కార్యక్రమం గురించి వివరించారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎండీ ముస్రీ, సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, నాయకులు ఉప్పులూరి హేమ శంకర్, పుప్పాల కన్నబాబు, సన్నేపల్లి సాయి బాబు, ఎం.వెంకటాచారి, బత్తుల వెంకటేశ్వరరావు, బాడిస రాము, కొండేటి బేబి, కంచర్ల గురవయ్య తదితరులు పాల్గొన్నారు.



సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ

తోకలపల్లిలో జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే



తోకలపల్లిలో సర్వే నిర్వహిస్తున్న సిగ్మా రీసెర్చ్ కన్సెల్‌టెన్సీ బృందం సభ్యులు

నిడమర్రు: ఢిల్లీకి చెందిన సిగ్మా రీసెర్చ్ కన్సెల్‌టెన్సీ ఏజెన్సీ సభ్యులు మండలంలో ప్రారంభించిన జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే శనివారంతో ముగిసినట్లు మండల వైద్యాధికారి డాక్టర్ కె. భాగ్యశ్రీ తెలిపారు. ఈ సందర్భంగా బృందం తోకలపల్లిలో 100 కుటుంబాలను సర్వే చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేసారు. ఈ సందర్భంగా డాక్టర్ భాగ్యశ్రీ మాట్లాడుతూ ఇండియన్ ఇన్సిస్టూట్ ఆఫ్ పాపులేషన్ సర్వే ప్రతి 5 ఏళ్లకు నిర్వహిస్తారని తెలిపారు. డాక్టర్ తేజశ్రీ, విస్తరణ అధికారి ఎం. జగ్గారావు, సర్పంచ్ గణసల కృష్ణకుమారి తదితరులున్నారు.

రేపు గుడివాకలంకలో ఎమ్మెల్యే పర్యటన

ఏలూరు రూరల్ : ఏలూరు మండలం గుడివాకలంక గ్రామంలో సోమవారం ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి పర్యటించనున్నారని ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎం సరళకుమారి చెప్పారు. ఆ రోజు సాయంత్రం 4 నుంచి రాత్రి 9 గంటల వరకూ జరిగే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారని వివరించారు. లబ్ధిదారులను కలుసుకుని సంక్షేమ పథకాలు వివరించడంతో పాటు సమస్యలపై స్థానిక సచివాయలంలో అధికారులతో చర్చిస్తారన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో గ్రాడ్యుయేషన్ డే

ఏలూరు (టూటౌన్): స్థానిక గన్‌బజార్, కొత్తపేట ఏకేజీ సెంటర్-1, ఏకేజీ సెంటర్-2, కబాడీ గూడెం -2 అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఐదేళ్లు నిండిన చిన్నారులకు అంగన్‌వాడీ కార్యకర్తలు పి.హైమావతి, డి.అన్నపూర్ణ అధ్యక్షతన గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఏలూరు అర్బన్ ప్రాజెక్టు సీడీపీఓ ఏ.పద్మావతి, బుద్ధిష్ట రాష్ట్ర కార్యదర్శి మనీ సింగ్, ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం సభ్యులు కస్తూరి హాజరై మాట్లాడారు. చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రాలలో ఆటపాటల ద్వారా విద్యనభ్యసించి స్కూల్‌కి సంసిద్ధం అయ్యారన్నారు. మూడేళ్లు నిండిన ప్రతి చిన్నారి అంగన్‌వాడీ కేంద్రాలలో ఐదేళ్లు నిండే వరకూ విద్యనభ్యసించాలన్నారు. పిల్లలు, గర్భవతులు, బాలింతలలో పౌష్టికాహార లోపం లేకుండా చూడటానికి అంగన్‌వాడీ కేంద్రాలు కృషి చేస్తున్నాయన్నారు. ఈ సందర్భంగా బుద్దిష్ట సొసైటీ రాష్ట్ర కార్యదర్శి మనీసింగ్ కబాడీగూడెం అంగన్‌వాడీ కేంద్రానికి 10 బెంచ్‌లు, 10 కుర్చీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్ వైజర్లు నాగలక్ష్మి, మంగ, ప్రజా సంఘాల నాయకులు మేతర అజయ్ బాబు, ఎల్.ప్రవళ్లిక, జి.శారద, బి.స్వర్ణలత, పీఎస్ రాజేశ్వరి, టి.అరుణ, పి.వరలక్ష్మి, సీహెచ్ రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



కొత్తపేటలోని అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు తదితరులు

న్యాయవాదులకు అవగాహన సదస్సు

ఏలూరు (టూటౌన్) : జాతీయ, రాష్ట్రీయ న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల ప్రకారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో కేశవానంద భారతి, స్టేట్ ఆఫ్ కేరళ జడ్జిమెంట్ వచ్చి 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా అవగాహన సదస్సును నిర్వహించారు. సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న పర్మినెంట్ లోక్ అదాలత్ ఛైర్‌పర్సన్ ఏ.మేరీ గ్రేస్ కుమారి మాట్లాడుతూ ఆస్తి హక్కు ప్రాథమిక హక్కుగా ఉండేదని ఈ హక్కును ప్రాథమిక హక్కుల నుంచి తొలగించడం జరిగిందని దీనిని పురస్కరించుకుని చారిత్రాత్మకమైన తీర్పును మననం చేసుకుంటూ దేశ వ్యాప్తంగా ఇటువంటి అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ సదస్సులో వినియోగదారుల ఫారం ప్రెసిడెంట్ కోదండ రామ్మూర్తి, ఏలూరు బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ ఎస్ రాముడు మాట్లాడారు. సదస్సులో పలువురు న్యాయవాదులు, ప్యానల్ లాయర్లు, కోర్టు సిబ్బంది, ఎన్జీవోలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పర్మినెంట్ లోక్‌అదాలత్ చైర్‌పర్సన్ ఎ.మేరీ గ్రేస్ కుమారి

విద్యుత్ సమస్య పరిష్కరించాలి



విద్యుత్ సమస్యపై ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇచ్చి వివరిస్తున్న కొల్లేరు నాయకులు

దెందులూరు: కొల్లేరులో లోఓల్టేజీ సమస్య పరిష్కారానికి నూతన ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేయాలని వైఎస్సార్ సీపీ నాయకులు ముంగర సంజీవ్ కుమార్, జయమంగళ రామారావు, కొల్లేరు పెద్దలు, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరిని కోరారు. శనివారం దెందులూరు ఎమ్మెల్యే కార్యాలయంలో కలిసి విద్యుత్ సమస్య ఉన్న గ్రామం, అవసరమైన ట్రాన్స్‌ఫార్మర్లు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, వెంటనే కొల్లేరు అభివృద్ధి, సంక్షేమం, మౌలిక వసతులకు తొలిప్రాధాన్యతనిస్తామని, విద్యుత్ సమస్య పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులకు ఎమ్మెల్యే ఆదేశాలు జారీ చేశారు.

వేంకటేశ్వర స్వామి ఆలయానికి రూ. లక్ష విరాళం

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : స్థానిక 42వ డివిజన్‌లోని శ్రీ కళ్యాణ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి వారి సేవలకు గాను నగరానికి చెందిన భక్తులు రూ.లక్ష విరాళం అందించారు. నగరానికి చెందిన వెన్నెలకోట శ్రీనివాసరావు, సత్య హేమలత దంపతులు వారి తల్లిదండ్రులు వెన్నెలకోట చిన్నబ్బాయి, వరలక్ష్మి దంపతుల జ్ఞాపకార్థం ఆలయ రాజపోషకులుగా ఈ విరాళాన్ని ఆలయ ప్రధానార్చకులు చక్రవర్తుల సత్య ప్రకాష్‌కు అందించారు. దీనితో పాటు భక్తుల సౌకర్యం కోసం హాట్ వాటర్, కూల్‌వాటర్ ఫ్రిజ్‌ను సైతం అందించారు. తొలుత ఆలయ మహిళా సేవాదళ్ ఆధ్వర్యంలో స్వామి వారికి సుప్రభాత సేవ, నిత్యార్చన, విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేసి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు.



స్వామివారి ఆలయానికి రూ.లక్ష విరాళంగా అందిస్తున్న భక్తులు

భూసర్వేతో రైతులకు మేలు

ఏలూరు రూరల్ : గ్రామ రెవెన్యూ అధికారులు ఫీల్డ్ లెవల్ వెరిఫికేషన్ ఆఫ్ లాండ్స్ రికార్డ్స్ (ఎఫ్‌పిఓఎల్ఆర్) కార్యక్రమం త్వరితగతిన పూర్తి చేయాలని ఏలూరు తహసీల్దార్ బి.సోమశేఖర్ అన్నారు. శనివారం గ్రామాధికారులు చొదిమెళ్లలో చేపట్టిన ఎఫ్‌పీఓఎల్ఆర్ భూ సర్వే, ఆర్‌బీకే కేంద్రం పనులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సర్వే రైతులకు ఎంతో మేలు చేస్తుందన్నారు. ఇందుకోసం ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు ఎంతో శ్రమిస్తున్నారని వివరించారు. సాంకేతిక పరిజ్ఞానం సహకారంతో చేపట్టిన భూముల రీసర్వే ప్రక్రియ భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు లేకుండా చూస్తుందనే నమ్మకాన్ని వెలిబుచ్చారు. దీంతో పాటు దీర్ఘకాలంగా ఉన్న సమస్యలు పరిష్కరించడంతో పాటు రైతులకు పక్కా సరిహద్దులతో పాటు హక్కులు సైతం ఏర్పడతాయన్నారు. రైతులు సైతం అధికారులకు సహకరించి భూమి డాక్యుమెంట్లు చూపాలన్నారు. ఇదే క్రమంలో అధికారులు సైతం భూ యజమానుల నుంచి త్వరితగతిన డాక్యుమెంట్లు రప్పించుకోవాలన్నారు. ఆయన వెంట వీఆర్వో తాడి వరప్రసాద్, సర్వేయర్ తేజ తదితర సిబ్బంది ఉన్నారు.



చొదిమెళ్ల పామాయిల్ తోటలో రైతుల పట్టా పుస్తకాలు పరిశీలిస్తున్న తహసీల్దార్ సోమశేఖర్

ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

గణపవరం: ప్రస్తుత వాతావరణ పరిస్థితులు దృష్టిలో పెట్టుకుని ధాన్యం కొనుగోలు వేగం వేగవంతం చేయాలని పశ్చిమగోదావరి జిల్లా జాయింట్ కలెక్టరు ఎస్.రామసుందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివారం ఆయన గణపవరం మండలం వల్లూరు ఆర్‌బీకే కేంద్రాన్ని సందర్శించి, ధాన్యం కొనుగోలు తీరుతెన్నులను పరిశీలించారు. ఇంతవరకు ఎంత ధాన్యం కొన్నదీ ఆరా తీశారు. రిజిష్టర్లు, తేమ శాతం కొలిచే యంత్రం, కాటా, గోదాములను తనిఖీ చేశారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. రైసుమిల్లుల నుంచి ఏసమస్య ఎదురైనా వెంటనే అధికారులు స్పందించి, తగు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ పమ్మిలక్ష్మిని, వ్యవసాయ అధికారి యర్రంశెట్టి ప్రసాద్‌ను ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనలు పాటించని రైస్‌మిల్లులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతుల వద్ద నుంచి ప్రభుత్వం నేరుగా ధాన్యం కొనుగోలు చేస్తున్నందున రైతులు ఎవ్వరూ మిల్లుల వద్దకు, దళారుల వద్దకు వెళ్లనవసరం లేదని తెలిపారు. రైతులకు ఏసమస్య వచ్చినా వెటనే రైతుభరోసా కేంద్రం అధికారి, తహసీల్దార్, వ్యవసాయాధికారి దృష్టికి తీసుకెళ్లాలని రైతులకు సూచించారు. అల్పపీడనం కారణంగా రానున్న రెండు మూడురోజులలో భారీవర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల ద్వారా అవకాశం ఉన్నందున రైతులు తమధాన్యం త్వరగా ఆరబెట్టుకుని ఆర్‌బీకేలకు అందించాలని సూచించారు. ఈయన వెంట ఎంపీడీవో జ్యోతిర్మయి, ఆర్‌బీకే సిబ్బంది, స్థానిక అధికారులు ఉన్నారు.



వల్లూరులో ఆర్‌బీకే వద్ద రైతులతో మాట్లాడుతున్న జేసీ రామసుందర్ రెడ్డి

విగ్రహం దొంగతనంపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం : అమ్మవారి విగ్రహం చోరీపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు. వివరాల ప్రకారం తాడువాయి పంచాయతీ పరిధిలోని గొల్లగూడెం గ్రామంలో చిన్న గ్రామ దేవత గుడి తాళాన్ని చవల నాగేశ్వరరావు అనే వ్యక్తి గునపంతో పగులగొట్టి గుడిలో ఉన్న చిన్న అమ్మవారి రాతి విగ్రహాన్ని శనివారం దొంగిలిస్తుండగా గ్రామస్తులు అతన్ని పట్టుకుని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. గ్రామస్తులు చాకిరి సోమరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఏలూరు మండలంలో 56.30 శాతం ఉత్తీర్ణత

ఏలూరు రూరల్ : పదో తరగతి పరీక్షా ఫలితాల్లో జెడ్పీ పాఠశాల విద్యార్థులు 56.30 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఏలూరు మండలంలో శ్రీపర్రు, చాటపర్రు, గుడివాకలంక, మాదేపల్లితో పాటు సత్రంపాడు, శనివారపుపేట, పోణంగి జెడ్పీ పాఠశాల నుంచి 540 మంది బాలబాలికలు పరీక్షలకు హాజరుకాగా వీరిలో 304 మంది ఉత్తీర్ణత సాధించారు. శనివారపుపేట జెడ్పీ పాఠశాల నుంచి 132 మంది పరీక్ష రాయగా 77 మంది ఉత్తీర్ణత సాధించారు. మాదేపల్లి నుంచి 68 మంది పరీక్షకు హాజరుకాగా 37 మంది, ప్రత్తికోళ్లలంక నుంచి 25కు గాను 10 మంది, గుడివాకలంక నుంచి 46కి మందికిగాను 10 మంది, శ్రీపర్రు నుంచి 23కు గాను 12 మంది, చాటపర్రు నుంచి 81కుగాను 45 మంది, పోణంగి నుంచి 32కుగాను 24 మంది, సత్రంపాడు నుంచి 133 మంది పరీక్ష రాయగా 80 మంది ఉత్తీర్ణత సాధించారని ఎంఈఓ సబ్బిత నరసింహమూర్తి చెప్పారు. పాఠశాల స్థాయిలో పోణంగి పాఠశాల విద్యార్థులు అత్యధికంగా 75 శాతం ఉత్తీర్ణత సాధించారు. మొత్తంగా 15 మంది 500 మార్కులు పైగా సాధించారు.

నేడు పూళ్లలో పార్కు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

భీమడోలు: పూళ్లలోని బావివీధిలోని బావి చెరువు వద్ద రూ.50 లక్షల నిధులతో చేపట్టిన పార్కు అభివృద్ధి పనులకు ఈనెల 7వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటలకు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు శంకుస్థాపన చేస్తామని మండల వైసీపీ కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావులు శనివారం రాత్రి తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని వారు తెలిపారు.

8 నుంచి వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరం

పెదపాడు: ఈనెల 8 నుంచి విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు పెదపాడు గ్రంథాలయ అధికారి తెలిపారు. విద్యార్థి ప్రాథమిక దశ నుంచి గ్రంథాలయ సందర్శన అలవాటు చేసేందుకు ఎన్నో వినూత్న కార్యక్రమాలు మే 8 నుంచి జూన్ 11 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వినడం మాట్లాడటం పఠనం, లేఖన నైపుణ్యములను మరింత మెరుగుపర్చేందుకు ఈ శిబిరం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులు తమ పేర్లను నమోదు చేయించుకోవాలన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరాలు ప్రారంభం

దెందులూరు: పోతునూరు గ్రంథాలయంలో రాష్ట్ర పౌర గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని పోతునూరు సర్పంచ్ బోదుల స్వరూప్, గ్రంథాలయ అధికారి డీ.జాన్‌బాబు ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి జాన్‌బాబు మాట్లాడుతూ వేసవి శిబిరంలో పుస్తక సమీక్షలు, కథలు వినటం, పుస్తక పఠనం, చిత్రలేఖనం, కథలు చెప్పడం, పేపర్ ఆర్ట్స్, థియేటర్ ఆర్ట్ వంటి సృజనాత్మక కార్యక్రమాలు ప్రతి రోజూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ నెల 8 నుంచి 11వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహించి వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకునేలా సహకరించాలని కోరారు.

రైతు పండించిన ప్రతి గింజనూ కొనుగోలు చేస్తాం

దెందులూరు: దెందులూరులో తడిచిన ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న రాష్ట్ర జలనవరుల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ధాన్యం కొనుగోళ్ల పర్యవేక్షణ ప్రత్యేకాధికారి శశిభూషణ్‌కుమార్ అన్నారు. శనివారం దెందులూరు ధాన్యం కొనుగోళ్లను పరిశీలించారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాల వర్షాల కారణంగా రైతులు పడుతున్న ఇబ్బందులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలుసుకున్నారన్నారు. రైతుల సంక్షేమమే ధ్యేయమని, రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయాలని ముఖ్యమంత్రి లిఖితపూర్వక ఆదేశాలు జారీ చేశారన్నారు. మిల్లర్లపై ఎటువంటి ఫిర్యాదులు వచ్చినా ఉపేక్షించబోమన్నారు. రైతు సమస్య తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటిస్తున్నామన్నారు. తడిచి, రంగు మారిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తామన్నారు. ధాన్యం అమ్మకాల్లో రైతులకు ఎదురయ్యే ప్రతి సమస్యను పరిష్కరిస్తామనా శశిభూషణ్ కుమార్ రైతులకు చెప్పారు. జిల్లా జాయింట్ కలెక్టర్ లావణ్యవేణి మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం సేకరణకు 50 లక్షల గోనెసంచులు అవసరం కాగా, ఇప్పటి వరకు 42 లక్షలు సంచులు అందుబాటులో ఉంచామన్నారు. శనివారం ఒక్కరోజే 60 వేల గోనె సంచులు అందించామన్నారు. ఆర్‌బీకే పరిధిలో ధాన్యం సేకరణ లక్ష్యం పూర్తయిందంటున్నారని, రవాణా సమస్యను రైతులు వివరించారు. ఈ సమస్యలపై ప్రత్యేకాధికారి శశిభూషణ్ కుమార్ వెంటనే స్పందిస్తూ అక్కడికక్కడే ధాన్యం సేకరణ లక్ష్యాన్ని సవరణ చేయాలని, అధికారులను ఆదేశించడంతో వెంటనే అధికారులు ఆన్‌లైన్‌లో ధాన్యం సేకరణ లక్ష్యాన్ని సవరణ చేశారు. వెనువెంటనే ధాన్యాన్ని కొనుగోలు ప్రక్రియను ఆర్‌బీకే ప్రారంభించింది. శశిభూషణ్ కుమార్ వెంట వ్యవసాయ శాఖ జేడీ వై.రామకృష్ణ, ఆర్‌డీఓ పెంచలకిషోర్, ఏడీఏ సుబ్బారావు, జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి రాజు, తహశీల్దార్ ఎస్‌వీ నాంచారయ్య, కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్లు కొలుసు గణపతిరావు, కొమ్మిన రాము, నల్లూరి వెంకట్రామయ్య (బాబి), రైతులున్నారు.



రైతులతో మాట్లాడుతున్న రాష్ట్రప్రత్యేకాధికారి శశిభూషణ్‌కుమార్

అసాంఘిక కార్యకలాపాలు ఉపేక్షించం



గణపవరం పోలీస్ స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న ఎస్పీ రవిప్రకాష్

గణపవరం: జిల్లాలో శాంతిభద్రతల విషయంలో రాజీపడే సమస్యలేదని, అసాంఘిక కార్యకలాపాలను సహించబోమని పశ్చిమగోదావరి జిల్లా ఎస్పీ రవిప్రకాష్ అన్నారు. శనివారం ఆయన ఇటీవల ఏలూరు జిల్లా నుంచి పశ్చిమగోదావరి జిల్లాలో విలీనమైన గణపవరం పోలీస్‌స్టేషన్‌ను తొలిసారిగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. స్టేషన్ రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కేసులు, సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. పశ్చిమగోదావరిలో విలీనమైన గణపవరం ప్రాంతాన్ని తొలిసారిగా సందర్శించినట్లు ఎస్పీ తెలిపారు. మండలంలో శాంతిభద్రతలు, గణపవరం, పిప్పర సెంటర్లలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలో పేకాట, కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భీమవరం డీఎస్పీ శ్రీనాథ్, తాడేపల్లిగూడెం సీఐ నాగరాజు గణపవరం స్టేషన్‌ను సందర్శించారు. గణపవరం ఎస్సై వేముల వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	14	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	24	చిక్కుడు కాయలు	76
వంకాయలు (కాంతులు)	34	చామదుంపలు	50
వంకాయలు (తెలుపు)	36	ములక్కాడలు	05-07
బెండకాయలు	30	కంద	48
పచ్చిమిర్చి	34	బీట్‌రూట్	36
కాకర కాయలు	40-44	కీరా దోస	26
బీరకాయలు	30	ఫ్రెంచ్‌బీన్స్	--
బీరకాయలు (పందిరి)	40	అల్లం	220
క్యాబేజీ	18	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	34-40	పాలకూర	08
దొండకాయలు	22	చుక్కకూర	08
బంగాళదుంపలు	22	తోటకూర	10
ఉల్లిపాయలు	18	గోంగూర	06
గోరుచిక్కుడు	40	పుదీనా	05
దోసకాయలు	12	బఠాణీ	--
ఆనబకాయ (1)	10-15	క్యాప్సికమ్	64
పొట్లకాయ(1)	15	చిలకడదుంప	30

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	03
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	00
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	33
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	25

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	01
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	00
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	00
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	00
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	00
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.15	34820	02
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	09.00	4794	రద్దు
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	33
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	34
ఏలూరు - బెంగళూరు	14.00	4021	--
ఏలూరు -తిరుపతి	16.00	4830	33